నేల కూలిన భారీ చెట్టు



సుల్తాన్‌బజార్: వర్షాలకు ఓ భారీ చెట్టు నేలకొరిగిన ఘటన శుక్రవారం రాత్రి సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం..కోఠి 94 గల్లీలో భారీ చెట్టు వర్షాలకు కృంగి పార్కుచేసిన ఓ కారుపై పడడంతో ఆ కారు ధ్వంసమైంది. ఈ సమాచారం తెలుసుకున్న డీఆర్ఎఫ్ బృందం సహాయక చర్యలు చేపట్టింది. రోడ్డుపై భారీ చెట్టు కూలడంతో ఆ రోడ్డున వెళ్లే వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడింది.

పొదుపు సంఘాలతో మహిళలకు ఆర్థిక పరిపుష్టి



ఇందిరా మహిళా శక్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పొదుపు సంఘాలు మహిళలకు ఆర్థిక పరిపుష్టి కలిగిస్తాయని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ డివిజన్ నదీమ్ కాలనీలో ఇందిరా మహిళా శక్తి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి కేంద్రాల స్థాపనకు బల్దియా యూసీడీ విభాగం వారు మహిళలకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. తాము సొంతంగా వ్యాపారం చేసుకుంటూ మరికొందరికి కూడా ఉపాధి కల్పించే అవకాశాలు మహిళలకు ఎన్నో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, బల్దియా యూసీడీ విభాగం అధికారుల బృందం తదితరులున్నారు.

నిమజ్జన రూట్ పరిశీలన



చాంద్రాయణగుట్టలో చెట్ల కొమ్మలను కట్ చేయిస్తున్న ట్రాఫిక్ ఉన్నతాధికారులు

చాంద్రాయణగుట్ట: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బాలాపూర్ గణేష్ వినాయక నిమజ్జన ప్రధాన రూట్‌ను పోలీస్ ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. నగర ట్రాఫిక్ డీసీపీ–3 వెంకటేశ్వర్లు, ఏసీపీ లక్ష్మణ్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు శ్రీను నాయక్, సైదిరెడ్డి గుర్రం చెరువు, కేశవగిరి, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, ఇంజన్‌బౌలి, శంషీర్‌గంజ్, అలియాబాద్, లాల్‌దర్వాజా మోడ్, ఛత్రినాక, ఉప్పుగూడ జెండా, కందికల్‌గేట్ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా నిమజ్జన రూట్‌లో రోడ్లకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను జీహెచ్ఎంసీ సిబ్బంది కట్ చేశారు. అక్కడక్కడ వేలాడుతున్న వైర్ల విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రోడ్లపై పడిన గోతులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజా సంక్షేమం



అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే పేద, బడుగు వర్గాలతో పాటు అన్నివర్గాల ప్రజా సంక్షేమం కొనసాగుతుందని గోషామహల్‌కు చెందిన ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. నూతనంగా టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆయన ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం కావడంతో పాటు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కొనసాగుతుందన్నారు. కష్టించి పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



గౌలిపురా: టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్ ఎన్నికైన సందర్భంగా పాత బస్తీలో యాకుత్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.రవిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం బాణాసంచాలు పేల్చి మిఠాయిలు పంచి పెట్టుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్, టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు అనీల్‌కుమార్ తుడి, నళినిగౌడ్, శశియాదవ్, కోట్ల లడ్డూ, ఖదీర్, ఇస్మాయిల్, ఘనీ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

జియాగూడ: ధూల్‌పేట్ నుంచి గణేష్ విగ్రహాన్ని టప్పాచబుత్ర నుంచి పురానాపూల్ వైపు వెళ్తున్న తరుణంలో రోడ్డు మధ్య ఉన్న విద్యుత్ తీగలు విగ్రహానికి తగిలాయి. దీంతో వాహనం ముందుకు వెళ్లినప్పటికీ తీగలు బయటకు రాకపోగా దానితో అనుబంధం ఉన్న సిమెంటు విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగింది. సమాచారం అందుకున్న కార్వాన్ విద్యుత్ ఏఈ విజయ్‌కుమార్, పురానాపూల్ వద్దకు చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి సుమారు మూడు గంటల పాటు శ్రమించి విద్యుత్ తీగలను తొలగించి ఒరిగిన స్తంభాన్ని తొలగించి తరలించారు.

సన్మానం



అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో 30 ఏళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ వహజుద్దీన్ అహ్మద్‌ను ఘనంగా సన్మానించారు. ఉత్తమ సర్వీస్‌మెన్‌గా ఆయనకు అవార్డు అందజేసి సత్కారం చేశారు. 2024 సివియా ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ అల్యూమి మీట్ చైర్మన్ నర్మద, ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ట్రెజరర్ విహహ్యశ్రీల ఆధ్వర్యంలో ఆయనను సత్కారం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ వాజుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ..ఒకే కళాశాలలో 30 ఏళ్లకు పైగా సేవలందించడం ఎంతో తృప్తిగా ఉందన్నారు.

మార్కెట్‌కు చవితి శోభ

- పూజా సామగ్రి కొనుగోళ్లలో భక్తులు
- కిటకిటలాడిన వివిధ మార్కెట్లు





ఛత్రినాక చౌరస్తాలో..



గుడిమల్కాపూర్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: ఆకుపత్రితో వినాయకుడిని పూజిస్తే సకల కోరికలు నెరవేరుతాయని భక్తులు నమ్ముతారు. దీంతో కోఠి, సుల్తాన్‌బజార్, బడిచౌడి మార్కెట్‌లో ఆకుపత్రి, పూజ సామగ్రి కొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో శుక్రవారం వినియోగదారుల సందడి కనిపించింది. వినాయక చవితికి వినాయక వ్రతం చేసుకునేందుకు ఇండ్లలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు భక్తులు పెద్ద ఎత్తున మార్కెట్లోకి వచ్చి వినాయక విగ్రహాలు కొనుగోలు చేశారు. వీటితో పాటు పూలు, పండ్లు, 21 రకాల ఆకులతో పాటు వివిధ పూజ సామగ్రిని కొనుగోలు చేశారు. వ్యాపారులు పూల ధరలను అమాంతంగా పెంచేశారు.

గుడిమల్కాపూర్‌లో..

గోల్కొండ: వినాయక చవితిని పురస్కరించుకొని పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గుడిమల్కాపూర్ చౌరస్తా, మెహిదీపట్నం రైతుబజార్, షేక్‌పేట్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో వివిధ రకాల పండ్లు, చింతకాయ, పత్రీ, మామిడాకు తదితర ఆకులు భారీగా అమ్ముడవుతున్నాయి.

చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో..

చాంద్రాయణగుట్ట: వినాయక చవితిని పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని మార్కెట్లలో సందడి వాతావరణం నెలకొంది. చిన్న గణపయ్యల విక్రయాలతో పాటు వినాయక పూజకు వినియోగించే పత్రి, మారేడుకాయలు, బంతిపూలు తదితర సామగ్రి కొనుగోలు చేసేందుకు మహిళలు పెద్ద ఎత్తున మార్కెట్లకు చేరుకున్నారు. ఛత్రినాక చౌరస్తా, లాల్‌దర్వాజా మోడ్, ఉప్పుగూడ జెండా, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా ప్రాంతాల్లో ఈ సందడి వాతావరణం కనిపించింది.







పూలు, ఆకుపత్రి కొంటున్న వినియోగదారులు

మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలి



అఫ్జల్‌గంజ్: మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని బౌద్ధనగర్ కాలనీవాసులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉదయ్‌కుమార్ సాక్షిత్, కర్ణాకర్ పేర్కొన్నారు. ఫిర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ అమర్‌సింగ్‌ను వారు కలిసి సన్మానించి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్, సాక్షిత్, కర్ణాకర్ మాట్లాడుతూ..ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధికి అనుగుణంగా అన్ని ప్రాంతాల్లో మరింత అభివృద్ధి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. మేయర్ అమర్‌సింగ్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వేగంగా యుద్ధ ప్రాతిపాదికన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు.

మహేష్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు



యాకుత్‌పురా: టీపీసీసీ అధ్యక్షుడుగా నియమితులైన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను శుక్రవారం సెట్విన్ మాజీ డైరెక్టర్, టీపీసీసీ కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో మహేష్‌కుమార్ గౌడ్ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా, 1994లో డిచ్‌పల్లీ ఎమ్మెల్యేగా పోటీ చేసి 2013–14 మధ్య కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పని చేశారన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రోడ్డుపై ట్రాఫిక్ జామ్



మూసి ఉన్న కూరగాయల మార్కెట్ గేటు వద్ద వ్యాపారులు

గోల్కొండ: అధికారుల నిర్లక్ష్యం కూరగాయల వ్యాపారులకే కాకుండా ప్రజలకు సైతం శాపంగా మారింది. గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ నిర్వహణపై కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మార్కెట్ కార్యాలయ సిబ్బంది ఉదయం 11 గంటలకే కూరగాయల మార్కెట గేట్లను మూసి వేశారు. దీంతో పండుగ పూజా సామగ్రి అమ్మకాలు, పండ్లు, పూలు, కూరగాయలు అమ్మే వారంతా రోడ్డుపైనే వ్యాపారాలు కొనసాగించారు. మామూలుగా సాయంత్రం వరకు కూరగాయల మార్కెట్‌లో రిటేల్ కూరగాయల అమ్మకాలు కొనసాగుతాయి. అయితే అధికారుల హఠాత్తుగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలలోపే గేట్లను మూసి వేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ కిసాన్ మోర్చా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అక్కడకు చేరుకున్నారు. గేట్ల వద్ద సిబ్బంది లేకపోవడంతో చేసేది లేక కూరగాయల వ్యాపారులను సముదాయించి గేట్ల ముందు వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. రోడ్లపైనే వ్యాపారం కొనసాగించడంతో లక్ష్మీనగర్ చౌరస్తా నుంచి గోల్డెన్ ప్యాలెస్ హోటల్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

రాష్ట్రాల అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి



గిరీష్ దంపతులను సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలని శ్రీశ్రీ సంపూర్ణ తూర్పు కాశీ క్షేత్రం పీఠాధిపతి వరసిద్ధి వరప్రసాద్ గురుజీ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన గిరీష్ ఐయ్యప్ప దంపతులను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ...విదేశాలలో స్థిరపడిన ప్రముఖులు వారి సొంత ప్రాంతాలను మరిచిపోవద్దని సూచించారు. అంతకు ముందు ఘంటసాల స్వరామృత ధార పేరిట నిర్వహించిన సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సినీ నటులు సుమన్, శివారెడ్డి, గజల్ శ్రీనివాస్, వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు పి.నాగేశ్వర్‌రావు, సమన్వయ కర్త శివరమ్య ధరణి, గాయకుడు శరత్‌చంద్రలతో పాటు వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

జియాగూడ: ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ మార్కెట్ సమీపంలోని సీతారాంపేట్ నివాసి సయ్యద్ తాజ్‌ముల్ అహ్మద్ అలియాస్ మోసీన్ అహ్మద్(46)ను తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు రాడ్‌తో దాడి చేశారు. రక్తపు మడుగులో పడిఉన్న అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతామని హత్యకు గల కారణాలు తెలియలేదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా హతుడి సమీప బంధువులే ఈ హత్యకు కారణమై ఉండవచ్చని అనుమానాలు స్థానికంగా రేకెత్తుతున్నాయి. మృతుడికి, అతని బావకు మధ్య కొంత కాలంగా భూ తగాదాలు కొనసాగుతున్నాయని వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు.

లాల్‌దర్వాజ లడ్డూలు రెడీ





బాలానంద స్వీట్‌హౌస్‌లో సిద్ధంగా ఉన్న లడ్డూలు

చార్మినార్: పాతబస్తీకి చెందిన తిరుపతి నర్సింగ్ రావు కుటుంబీకులు దశాబ్దాలుగా లాల్‌దర్వాజలో వినాయకుని లడ్డూలను తయారు చేస్తున్నారు. లాల్‌దర్వాజాలోని బాలానంద స్వీట్ హౌస్ యజమానైన తిరుపతి నర్సింగ్ రావు పూర్వీకులు సైతం వినాయకుని లడ్డూలు ఆర్డర్‌పై తయారు చేసేవారు. ఇలా వారసత్వంగా ప్రస్తుతం నర్సింగ్ రావు కుటుంబీకులు కూడా వినాయకుని లడ్డూల తయారీలో పూర్తిగా నిమగ్నమయ్యారు. పాతబస్తీలో దశాబ్దాలుగా లడ్డూలు తయారు చేస్తున్న వీరి వద్ద ఆర్డర్లు ఇచ్చి కొనుగోలు చేసేందుకు మండప నిర్వాహకులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వీరి వద్ద కిలో నుంచి 100 కిలోల పరిమాణం వరకు లడ్డూలను తయారు చేస్తున్నారు. స్వచ్ఛమైన నేతితో పాటు డ్రై ఫ్రూట్స్‌తో తయారు చేసే ఈ లడ్డూలకు ఇక్కడ ఎంతో ఆదరణ ఉంది.

దైవ సంకల్పంగా భావిస్తాం..



వినాయకుని లడ్డూలు తయారు చేయడం దైవ సంకల్పంగా భావిస్తున్నాం. ఈ లడ్డూల తయారీని మేము వ్యాపార దృక్పథంతో చూడడం లేదు. భగవంతుడు కల్పించిన పుణ్యకార్యంగా భావిస్తున్నాం. అందుకే ఏళ్ల తరబడి ఈ కార్యక్రమంలో నిమగ్నమయ్యాం. లడ్డూలు తయారు చేస్తున్న మాకు ఆయురారోగ్యాలతో పాటు సుఖసంతోషాలు కలుగుతున్నాయి.

– తిరుపతి నర్సింగ్ రావు, లడ్డూల తయారీదారుడు

'ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యత్వ నమోదు చేయవచ్చు'



రతన్ మహేష్

అబిడ్స్: ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యత్వ నమోదు చేయవచ్చని కోర్టు తీర్పు ప్రకారం లెక్కలు తేలే వరకు ఎన్నికలు జరపవద్దని ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు రతన్ మహేష్ పేర్కొన్నారు. ఎస్ఎస్‌కే సమాజ్‌లో జరిగిన పలు అవకతవకలపై కొందరు న్యాయస్థానం ఆశ్రయించడంతో కోర్టు తీర్పు వచ్చిందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం..సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. గతంలో పలువురు అవకతవకలకు పాల్పడినందు వల్లే కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారని వివరించారు. న్యాయస్థానం తీర్పు ప్రకారం వెంటనే సభ్యత్వ నమోదు చేసి లెక్కలను ముందుగా తేల్చాలన్నారు. లెక్కలు తేలిన తర్వాతనే న్యాయస్థానం తీర్పు ప్రకారం ఎన్నికలు జరపవచ్చని రతన్ మహేష్ పేర్కొన్నారు.

మట్టి గణనాథులను పూజిద్దాం



హెచ్‌సీఎఫ్ ఆధ్వర్యంలో..

గోల్కొండ: మట్టి గణనాథులను పూజించడమే అత్యుత్తమమని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. బీజేపీ నాయకుడు నామ యాదగిరి నేత, సందేష్‌యాదవ్, సుధాకర్‌యాదవ్, ముఖేష్‌సాగర్, అనిల్ తదితరులున్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో..

గౌలిపురా: హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం లాల్‌దర్వాజా వెంకట్‌రావు స్కూల్ సమీపంలోని దత్త సాయి ఆలయం వద్ద మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ పాల్గొని భక్తులకు మట్టి వినాయకులను అందజేశారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి కటకం శివకుమార్ గుప్తా, ప్రాజెక్టు చైర్మన్ శ్రీరాం కోటయ్యగుప్తా, కో కన్వీనర్ శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, కో చైర్మన్లు ఉదయ్ భాస్కర్, భిక్షపతి, విశ్వేశ్వరయ్య, అశోక్‌కుమార్, సంతోష్ కుమార్, పడకంటి వెంకటేష్ పాల్గొన్నారు.

జియాగూడలో..

జియాగూడ: మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని హైదరాబాద్ సిటిజన్ ఫోరం స్థానిక ఆర్గనైజర్ పల్లవి అన్నారు. శుక్రవారం జియాగూడలోని దుర్గానగర్‌లో హెచ్‌సీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత గణేష్ విగ్రహాల పంపిణీ జరిగింది. హెచ్ఎండీఏ సహకారంతో హైదరాబాద్‌లోని 25 బస్తీలలో కూడా పంపిణీ చేయడం జరుగుతుంది. మమత, లక్ష్మి, లావణ్య, అశోక్, సీపీఎం నాయకుడు నాగేష్ పాల్గొన్నారు.

మట్టి గణనాథులను ప్రతిష్ఠించుకోవాలి..

చాంద్రాయణగుట్ట: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణనాథులను ప్రతిష్ఠించుకోవాలని భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి బహదూర్‌పురా నియోజకవర్గం కన్వీనర్ ఉదయ్ కిరణ్ రెడ్డి అన్నారు. అలియాబాద్ కాల్వగడ్డలోని హనుమాన్ ఆలయంలో స్థానిక భక్తులకు ఉచితంగా మట్టి గణనాథులను పంపిణీ చేశారు. మైల్ నవీన్ కుమార్, పవన్ కుమార్, సంతోష్‌కుమార్, సచిన్, నరేందర్ పాల్గొన్నారు.



మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న వెంకటేశ్, సభ్యులు



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఉదయ్ కిరణ్‌రెడ్డి



గుడిమల్కాపూర్‌లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న దేవర వంశీ తదితరులు

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు



చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడేళ్ల క్రితం బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి నాంపల్లి 12వ సెషన్స్ పోక్సో కోర్టు జడ్జి టి.అనిత జీవిత ఖైదు విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పుగూడ దానయ్యనగర్‌లో నివాసం ఉండే మీసాల రాకేష్ అలియాస్ చింటూ(24) 2021లో ఓ బాలికను నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. బాలికను నిర్బంధించిన సెక్షన్‌లో ఒక సంవత్సరం జైలు శిక్షను విధించింది.

జిట్టా బాలకృష్ణారెడ్డి మరణం తీరని లోటు



యాకుత్‌పురా: జిట్టా బాలకృష్ణారెడ్డి అకాల మరణం తీరని లోటని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బాలకృష్ణ మరణం పట్ల న్యాయవాదుల ఆధ్వర్యంలో శుక్రవారం మౌనం పాటించి సంతాపం తెలిపారు. గోవర్ధన్‌రెడ్డి మట్లాడుతూ..ప్రత్యేక రాష్ట్ర సాధనకు తమ సహచర ఉద్యమకారుడు బాలకృష్ణ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు.